## క్లుప్తంగా

### అడిషనల్ డీసీపీకి శుభాకాంక్షలు



అంబర్‌పేట: మల్కాజిగిరి అడిషనల్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన ఎస్.వెంకటరమణకు అంబర్‌పేటకు చెందిన సేవా యూత్ అసోసియేషన్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు రచ్చ శ్రీనివాస్, ప్రతినిధులు జీఎల్. నరసింహారావు, బాబా, పాండురంగం తదితరులు ఉన్నారు.

**సీసీఎస్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీనివాస్..**



కవాడిగూడ: నూతనంగా సీసీఎస్ అడిషనల్ డిప్యూటీ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.శ్రీనివాస్‌కు కవాడిగూడ దోమలగూడకు చెందిన సంజీవ్ అగర్వాల్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

### 46 జీవోను రద్దు చేయించండి

ఉస్మానియా యూనివర్సిటీ: జీవో నంబర్ 46ను రద్దు చేయించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఓయూ జేఏసీ నేతలు వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం ఓయూ జేఏసీ నాయకులు ఏనుగంటి రాజునేత ఆధ్వర్యంలో పోలీసు ఉద్యోగాలకు పోటీ పడుతున్న అభ్యర్థులు కిషన్‌రెడ్డిని కలసి 46 జీవో వలన తెలంగాణలో అన్ని రకాల పోలీసు ఉద్యోగాలకు పోటీపడుతున్న నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని వివరించారు. గతంలో 2016, 2018 నియామకాల్లో జీవో నంబరు 46 లేదన్నారు. కేవలం 2022 నోటిఫికేషన్‌ల్లో జీవోను అమలు చేయడం వలన వందలాది మంది నిరుద్యోగులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు అభ్యర్థుల వినతికి సానుకూలంగా స్పందించిన మంత్రి 46 జీవో రద్దుకు కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చినట్లు ఓయూ జేఏసీ నాయకులు పేర్కొన్నారు.

### హాస్పిటల్ ఏర్పాటు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తాం

లాలాపేట: బస్తీలో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వంద రోజులకు పైగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు స్పందించక పోవడం బాధాకరమని మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. 'చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మిద్దాం' అంటే మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 116 రోజులకు చేరాయి. శుక్రవారం రిలే దీక్షలో కాంగ్రెస్ నాయకులే వేముల శ్రీనివాస్, ఆలకుంట లింగయ్య, ఏసి నర్సింహ్మా, బిఆర్ఎస్ నాయకులు ఓర్సు శేఖర్, ఓర్సు కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ భారీ వర్షాలకు సైతం లెక్క చేయకుండా దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. హాస్పిటల్ ఏర్పాటు చేసే వరకు దీక్షను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

### సహాయక చర్యలు చేపట్టాలి

లాలాపేట: భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ తార్నాక డివిజన్ అధ్యక్షులు రాము వర్మ అన్నారు. శుక్రవారం ఆయన తార్నాక డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, బస్తీల్లో పర్యటించారు. వర్షానికి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు నాలా పరీవాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేణుయాదవ్, వెంకటేష్‌గౌడ్‌పోచయ్య, సుబ్బారావు, బిక్షపతి, గణేష్, శ్రీనివాసచారి, రామకృష్ణ, ఆకుల శ్రీనివాస్, అనిత, అనూష, శశి,కృష్ణమూర్తి, మహేశ్, గోవర్ధన్,ఉపేందర్, ప్రమోద్, కరుణాకర్, చిన్న పాల్గొన్నారు.

### రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: మద్యానికి బానిసైన ఓ వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన కృష్ణమూర్తి(65) శుక్రవారం ఉదయం లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మద్యానికి బానిసైన అతను జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు పేర్కొన్నారు.

# వరద ముంపు నివారణకు చర్యలు

**ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం లేదని కేంద్రమంత్రి విమర్శ**



మూసారాంబాగ్ వద్ద మూసీ నదిని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: వర్షాలతో నాలాల పరిసరాల్లో వరద ముంపు సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్‌లో ఉన్న మెయిన్ చెరువు నాలా నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ లతో కలిసి పరిశీలించారు. 4కిలోమీటర్ల మేర ఉన్న నాలాను గత ఏడాదిన్నర క్రితం సుమారు రూ.22 కోట్లతో విస్తరణ పనులు చేపట్టారు. చేపట్టిన పనుల్లో కనీసం 30 శాతం కూడా పూర్తి కాలేదని కమిషనర్‌కు ఎమ్మెల్యే వివరించారు. ఇప్పటికైనా నాలా విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టిసారించి పూర్తి చేయాలన్నారు. నాలా నమూనా చిత్రాన్ని పరిశీలించి పరిష్కారించే చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు కమిషనర్ సూచించారు. జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మారుతీదివాకర్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు జియాఉద్దీన్, కిషోర్‌లతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**రత్నానగర్ వద్ద నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పరిశీలన..**

నల్లకుంట: హుస్సేన్‌సాగర్ నాలా పరివాహక బస్తీలలో వరదముంపు సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నాలాకు ఇరువైపులా రక్షణ కవచంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. వరదముంపు నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు చేపట్టిన రిటైనింగ్ వాల్ పనులకు అందరూ సహరించాలన్నారు.

- నల్లకుంట శివానందన్‌నగర్, రత్నానగర్ వద్ద జరుగుతున్న హుస్సేన్ సాగర్ నాలా రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ.. శివానంద్‌నగర్ వైపు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చాలా వరకు పూర్తి కావస్తున్నాయన్నారు.
- కొందరు కోర్టుకు వెళ్లడంతోనే పనుల్లో కాస్త జాప్యం జరిగిందని రత్నానగర్ వైపు కూడా రిటైనింగ్ వాల్ పనులు చేపట్టాల్సి ఉందన్నారు.



నాలా నమూనా చిత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కమిషనర్ రోనాల్డ్ రాస్

పనుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఇళ్లు కోల్పోతున్న వారికి ముందస్తుగా నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. బాధితులకు పరిహారం అందిస్తున్నామని తెలిపారు. వాల్ నిర్మాణంలో ప్రజలకు ఎక్కువగా నష్టం వాటిల్లకుండా చూస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్టు సమాచారం.

- పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు.

**ఇళ్లకు ఎక్కువ నష్టం కలగకుండా నిర్మాణం చేపట్టాలి..**

వరద ముంపు నుంచి రక్షణ కల్పించేందుకు చేపడుతున్న నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను తాము వ్యతిరేకించడం లేదని ఇళ్లకు ఎక్కువ నష్టం వాటిల్లకుండా నాలా విస్తరణను తగ్గించి రిటైనింగ్ వాల్ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇంజినీర్ ఇన్ చీఫ్ జియాఉద్దీన్, ఎస్ఎన్‌డీపీ సీఈ కిషోర్, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మారుతిదివాకర్, ఏఎంహెచ్‌ఓ జ్యోతిబాయి, సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్ ఇతర అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



శివానంద్‌నగర్ వద్ద నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

### చినుకు పడితే నగరం సమస్యలమయం ..

అంబర్‌పేట: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించడంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. చినుకు పడితే నగరం సమస్యలమయంగా మారుతోందన్నారు. శుక్రవారం ఆయన స్థానిక బీజేపీ నేతలతో కలిసి అంబర్‌పేట నియోజకవర్గం, మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. నియోజకవర్గంలోని మెయిన్ చెరువు నాలా పనులను పరిశీలించారు.

- గత ఏడాదిన్నరగా ఒక్క నాలాను కూడా ప్రభుత్వం పూర్తి చేయలేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు.
- ప్రతి వర్షాకాలంలో ఇక్కడి నాలా పరిసరాల్లో నివసించే ప్రజలు వరద ముంపునకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రేమ్‌నగర్, న్యూ ప్రేమ్‌నగర్, అజాద్‌నగర్ ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర చేసి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు రోడ్ల ప్యాచ్ వర్క్స్, నాలా స్లాబ్, పారిశుధ్య సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకురాగా.. తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ముసారాంబాగ్ బ్రిడ్జి వద్ద మూసీనది సమస్యలను ఆయన పరిశీలించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.గౌతంరావు, నాగభూషణం చారి, శ్యామ్‌రాజ్, జి.ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి వరద నీరు

**వరద నీటిని తొలగింపజేసిన డీఆర్ఎఫ్ బృందం**

నల్లకుంట: గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నల్లకుంట డివిజన్‌లోని పలు అపార్ట్‌మెంట్ సెల్లార్‌లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. న్యూ నల్లకుంటలోని హ్యాపీ హోం అపార్ట్‌మెంట్‌తో పాటు తిలక్‌నగర్ ప్రాంతంల్లోని కొన్ని అపార్ట్‌మెంట్ సెల్లార్‌లలోకి వరద నీరు చేరిన విషయం తెలుసుకున్న కార్పొరేటర్ అమృత వెంటనే జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వరద నీటిని తొలగింపచేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన వారు తొలగింపచేసేందుకు వెంటనే డీఆర్ఎఫ్ బృందాన్ని పంపించారు. డీఆర్ఎఫ్ బృందం విద్యుత్ మోటార్ల సాయంతో వరద నీటిని తొలగింపచేశారు.



# దాశరథి, సినారెలను కవులు స్ఫూర్తిగా తీసుకోవాలి



దాశరథి, సినారెలకు నివాళులర్పిస్తున్న జూలూరి గౌరీశంకర్, కళా జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి : నిరంకుశ పాలన పట్ల దాశరథి క్రిష్ణమాచర్య చూపిన ధిక్కార స్వరం, తన కవితల్లో సి.నారాయణరెడ్డి చూపిన మానవీయత నేటి కవులు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరిగౌరీ శంకర్ కోరారు. శుక్రవారం చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయగానసభలో ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా దాశరథి క్రిష్ణమాచార్య, డాక్టర్ సి.నారాయణరెడ్డిల జయంతి ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ ఆధునిక కాలంలోనూ అధిపత్యశక్తులు సమాజాన్ని విభజించే కుట్రలు చేస్తున్నాయని సినారె మనిషి మానవత అంశంగా కవితలు అల్లారని దాశరథి నిరంకుశత్వంపై అగ్ని ధార కురిపించారని వివరించారు. అత్యాధునిక కాలంలో కూడా అధిపత్యాలు చెలాయిస్తూ సమాజాన్ని విభజించే శక్తులను తిప్పికొట్టవలసిన బాధ్యత సాహిత్య సాంస్కృతిక రంగాలకు ఉందన్నారు. కులం, మతం పేరున వికృత దాడులు చేసే విష సంస్కృతిని పారదోలవలసిన బాధ్యత నేటి సాహిత్య సృష్టికర్తలదేనని పేర్కొన్నారు. నేటి సమాజంలోని రుగ్మతలపై కవులు రచయితలు మేధావులు తమ కలాలకు పదును పెట్టాలన్నారు. కార్యక్రమంలో సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుదిబండి వెంకట్‌రెడ్డి, ఎంజె ఈవెంట్స్ గాయని తోట శ్రీలక్ష్మి ప్రసంగించారు.

# మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మణిపూర్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జాతీయ అధ్యక్షుడు రాగాల నాగేశ్వర్ రావు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో దమణకాండ కొనసాగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో మణిపూర్ కుకీ గిరిజన మహిళల నగ్న ఊరేగింపు, అత్యాచారాలను నిరసిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెడుతూ మారణహోమం సృష్టిస్తుందని ఆరోపించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ అధ్యక్షుడు సుదర్శన్‌బాబు, ఏపీ అధ్యక్షుడు కె.చెన్నకేశవరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, సెక్రటరీ జనరల్ నర్సింహ్మారావు, కోశాధికారి శంకర్, జాతీయ సహాయ కార్యదర్శి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షులు రాగాల నాగేశ్వర్‌రావు

### పెండింగ్ జీఓల అమలుకు కృషి

చిక్కడపల్లి: వివిధ రంగాల్లో కార్మికుల కనీస వేతనాలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న జీఓల విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి అమలుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ పులిమామిడి నారాయణ అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో శుక్రవారం కనీస వేతనాల మండలి మొదటి సమావేశంలో మండలి చైర్మన్ నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. మండలి సభ్యులు శివశంకర్, శంకర్‌రెడ్డి, నర్సింహ, మల్లికార్జున్, నిరంజన్‌రావు, దుర్గప్రసాద్, చేతన్, బోర్డు కార్యదర్శి, డీసీఎల్ శ్యామ్ సుందర్‌రాజు, సీనియర్ సూపరిండెంట్ తదితరులు హాజరై కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం చైర్మన్ నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 73 షెడ్యూల్డ్‌లో కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయించి వేతనాలు అందించేలా కృషి చేస్తామని వివరించారు. పెండింగ్‌లో ఉన్న జీఓలను అమలు చేయడం ద్వారా 90 లక్షల మంది సంఘటిత, అసంఘటిత కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. అనేక రంగాల్లో కార్మికుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పరిశ్రమలకు నిరంతరం విద్యుత్ అందించడంతో కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు.



మాట్లాడుతున్న పులిమామిడి నారాయణ

### మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోల్ పగిలి స్థానికులు నిత్యం అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్ సమస్యను గుర్తించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. దీంతో అధికారులు మరమ్మతులు చేపట్టారు. బీఆర్ఎస్ నేతలు దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, శివగణేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### అత్తింటి వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య



ఫిర్దోజ్‌ఫాతిమా (ఫైల్)

ముషీరాబాద్: అత్తింటి వేధింపులు తాళలేక ఓ మహిళ 4వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. భోలక్పూర్ బీర్‌కాన్ గల్లీకి చెందిన ఫిర్దోజ్‌ఫాతిమా(22)కు గుల్షన్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ఫిరోజ్‌తో 2022 జూలై 26న వివాహమైంది. పెళ్లైన కొద్దిరోజుల నుంచి భర్తతో పాటు అతడి కుటుంబసభ్యులు వేధిస్తున్నారు. కాగా విషయాన్ని ఆమె తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు తెలపగా.. సర్దిచెప్పుకుంటూ వచ్చారు. తనకి పిల్లలు పుట్టనందున మరో పెళ్లి చేసుకుంటానని భర్త కుటుంబసభ్యులు బెదిరింపులకు పాల్పడినట్టు సమాచారం. గురువారం పుట్టింటికి వెళ్లిన ఫిర్దోజ్ ఫాతిమాను తిరిగి సోదరులు రాత్రి 11.30 గంటలకు అత్తారింట్లో దించి వచ్చారు. శుక్రవారం ఉదయం సుమారు 11.40 గంటలకు భర్త సోదరుడు ఇర్ఫాన్ ఫోన్ చేసి మీ అక్క ఇంటిపై నుంచి దూకిందని తల పగిలి చనిపోయినట్లుగా ఆమె సోదరుడికి చెప్పారు. విషయం తెలుసుకున్న ఫాతిమా కుటుంబసభ్యులు తమ సోదరి చావుకు కారకులైన ఫిరోజ్, అతని సోదరులు ఆజామ్, పారుఖ్, ఇర్ఫాన్, సోదరి సభా, మెరాజ్, నాజ్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతురాలి సోదరుడు అబ్దుల్ హమీద్ ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సామాన్యులకు న్యాయం జరిగేలా కృషి





మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ సరోజ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాన్య ప్రజలకు సైతం సంపూర్ణ న్యాయం జరిగేలా న్యాయవాదులు కృషి చేయాలని అంబేద్కర్ కళాశాలల కరస్పాండెంట్ జి.సరోజ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని లా కళాశాలలో 3వ సంవత్సరం పూర్తి చేసుకున్న న్యాయ విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయులు, డాక్టర్లతో పాటు న్యాయవాదులకు కూడా మంచి గుర్తింపు, గౌరవం ఉందన్నారు. దేశంలో ప్రముఖులు కూడా న్యాయం కోసం వస్తారని అంతటి ప్రాముఖ్యత ఈ వృత్తికి ఉందన్నారు. న్యాయవాదులు సామాన్య ప్రజలను గుర్తించి వారికి న్యాయసేవలను అందించాలన్నారు. నేరస్తులతో పాటు అవినీతిని అంతమొందించేందుకు న్యాయవాదులు నడుంబిగించాలని ఆమె పిలుపునిచ్చారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ రత్న, డాక్టర్ రిషికాంత్, ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన తదితరులున్నారు.

### ఉత్తమ సామాజిక సేవా పురస్కారం



సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

చిక్కడపల్లి: కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ హిప్నో పద్మాకమలాకర్ ఉత్తమ సామాజిక సేవా పురస్కారం అందుకున్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ నవభారత్ క్లబ్ 6వ వార్షికోత్సవం సందర్భంగా 2022–23 సంవత్సరానికి ఉత్తమ సామాజిక సేవా పురస్కారాన్ని ఆమెకు శుక్రవారం లయన్స్‌భవన్‌లో రీజియన్ చైర్ పర్సన్ ఆర్.జగన్నాథం అందజేశారు. జోనల్ చైర్మన్ గోపాలకృష్ణ, సురేష్, కోటేశ్వరరావు, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం

కాచిగూడ: హైదరాబాద్ చెస్ సెంటర్ నూతన కార్యవర్గాన్ని వైఎంసీఏలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అమిత్ పాల్ సింగ్, ప్రధానకార్యదర్శిగా వై.సమీర్‌కుమార్, కోశాధికారిగా దయాబేతి, ఉపాధ్యక్షులుగా ఎం.స్వప్న, వీవీ సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా చేతన్‌శర్మ, వై.రమేష్, కార్యవర్గ సభ్యులుగా ఎం. రమామోహన్‌రావు, వీఎస్ఎన్ మూర్తి, వీఎస్‌టీ సాయి, ప్రవీణ్ ఎన్నికయ్యారు.





# సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టండి



సిబ్బందికి సూచనలు చేస్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్

కాచిగూడ: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను చేపట్టాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కాచిగూడ వార్డు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఆమె సమావేశమై డెంగీ వ్యాధి ప్రబలకుండా చూడాలని కోరారు. రోజూ చెత్తను తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. యాదయ్య, శ్రీనివాస్, నరేందర్, అంబిక, రాము, బల్వీర్, బాలప్రసాద్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, సూరి, రవియాదవ్ పాల్గొన్నారు.

# వరద బాధితులకు నష్టపరిహారం అందించాలి

కవాడిగూడ: 'విశ్వనగరం నిర్మించామని గొప్పలు చెప్పుకుంటూ దీర్ఘకాలిక వరదలను తట్టుకునే ప్రణాళికను అభివృద్ధి చేయకుండా నగరంలో వరద లాంటి పరిస్థితి కల్పించడం బీఆర్ఎస్ చేసిన విపత్తు అని' కాంగ్రెస్ నేత డాక్టర్ కోట నీలిమ ఆరోపించారు. వరద బాధిత కుటుంబానికి రూ.10 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిస్థితిని నియంత్రించడంలో జీహెచ్ఎంసీ పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బాగ్‌లింగంపల్లిలో..**

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారీ వర్షాలతో నష్టపోయిన వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ కుటుంబానికి ప్రకటించిన రూ.10 వేల మాదిరిగా రాష్ట్రంలో ప్రతి ఇంటికీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే సహాయక చర్యలు చేపట్టి బాధితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

**అస్తవ్యస్తమైన రోడ్లు..**

ముషీరాబాద్: వర్షాలతో రోడ్లు అస్తవ్యస్తంగా మారినా మంత్రి కేటీఆర్ పట్టించుకోకపోవడం లేదని ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్ మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు ఆరోపించారు. శుక్రవారం ఆ పార్టీ పిలుపు మేరకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో భాగంగా ఆయనను ముందస్తుగా ముషీరాబాద్ పోలీసులు గంగపుత్ర కాలనీలోని ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామకృష్ణ, రాములను హౌస్ అరెస్టు చేశారు. వర్షాలతో నష్టపోయిన బాధిత కటుంబాలకు ఆర్థికసాయం కూడా అందజేయలేదన్నారు. గత వారం రోజులుగా పేద ప్రజలకు ఉపాధి లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దీనిపై బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు.



కాంగ్రెస్‌నేత డాక్టర్ నీలిమను అరెస్టు చేస్తున్న దృశ్యం



కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి హౌస్ అరెస్టు

# విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు

కవాడిగూడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల భీమా మైదాన్‌లో పేద ప్రజలకు ఎలాంటి విష జ్వరాలు సోకకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు తెలిపారు. శుక్రవారం సీనియర్ ఎంటమాలజిస్ట్ దుర్గప్రసాద్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ మహేష్‌కుమార్, సిబ్బంది ఇస్మాయిల్, బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.శంకర్‌తో కలిసి ఆయన బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు విషజ్వరాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బస్తీలో దోమల నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

**బాధితులకు న్యాయం చేస్తాం..**

కవాడిగూడ: భారీ వర్షాలతో కవాడిగూడ డివిజన్ దోమలగూడ సూరజ్‌నగర్ నాలా పరివాహక ప్రాంతాన్ని శుక్రవారం స్థానిక కార్పొరేటర్ జి.రచనశ్రీ, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ నేతలు అధికారులతో కలిసి సందర్శించారు. వరదతో ఇబ్బంది పడుతున్న బాధితుల సమస్యలను అడిగి తెలుసుకుని తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ నేతలు జి.వెంకటేష్, నాయకులు పరశురాం, విఠల్, లింగంగౌడ్, శ్రీనివాస్, ఆంజనేయులు, సలంద్రి దిలీప్, రమేష్ బాబు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానాను సందర్శించిన చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు



నాలా పరీవాహక ప్రాంతంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ